www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 06 | జూన్ | 2026 పేజీలు : 8


## పేదల పక్షాన నిలిచే ఏకైక పార్టీ సిపిఐ



- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా
-సిపిఐలో భారీ చేరికలు

8 లో

# ఖరీఫ్ సాగుకు సన్నద్ధం..!



### -దుక్కులు సిద్ధం చేసిన మెట్ట రైతులు
### -కల్లాల్లోనే ఇంకా యాసంగి ఉత్పత్తులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమయ్యారు. మృగశిరకార్తె సమీపిస్తుండటం, గత రెండు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో అక్కడక్కడ జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. గత 10 రోజులుగా చినుకు కోసం ఎదురు చూసిన రైతులు చెదురు మదురు వానలు పడుతుండడంతో దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తుండగా వాటిని రైతులు తమ చేలల్లో చల్లుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడతాయని వాతావరణ శాఖ, ఇతర సంస్థలు తెలుపుతున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. తక్కువ సమయంలో చేతికి వచ్చే పంటలను సాగు చేయాలని కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పరిస్థితి ఇలా ఉంటే ఇంకా కల్లాల్లోనే మొక్కజొన్న, ధాన్యం రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కాంటాలు కాక, ఎగుమతులు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరల వ్యవసాయ సీజన్ ప్రారంభ సమయం ఆసన్నమైన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు జరగకపోవడం, కొనుగోళ్లు జరిగిన చోట పూర్తి స్థాయిలో ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో

మిగతా 2లో..

## ఉలిక్కిపడ్డ మూడో వార్డు షాడో..!



డబ్బుల విషయంలో ఓ గుడిలో ప్రమాణం చేస్తున్న దృశ్యం

- దొంగే.. దొంగ దొంగ అన్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు
- తీవ్ర చర్చనీయాంశంగా ప్రజాపక్షం కథనాలు
- అడ్డగోలు పర్వంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని మూడోవ వార్డుకు చెందిన ఓ షాడో నాయకుడి వ్యవహారాలు రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన పలు అంశాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రస్తావనకు వచ్చిన అంశాల నేపథ్యంలో సంబంధిత షాడోపై మరిన్ని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా 23వ వార్డులో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ వ్యవహారానికి సంబంధించి పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా ఒక స్థలానికి సంబంధించిన వ్యవహారంలో ఓ వ్యక్తి వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు ప్రచారంలో ఉన్న వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోపై స్థానిక ప్రజల్లో చర్చ కొనసాగుతుండగా, అసలు నిజానిజాలు వెలుగులోకి రావాలని డిమాండ్ వినిపిస్తోంది. ఇదిలా ఉండగా, ప్రజాపక్షం ప్రచురించిన కథనం తర్వాత వాట్సాప్ గ్రూపుల్లో వరుస పోస్టులు వెలువడుతున్నాయి. ఈ పోస్టుల ద్వారా ఆరోపణలకు సమాధానం చెప్పే ప్రయత్నమా? లేక ప్రజల దృష్టిని మళ్లించే వ్యూహమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సదరు షాడో దొంగే దొంగ దొంగ అన్నట్లు వ్యవహారం సాగిస్తూ తనని తానే బహిర్గతం

మిగతా 2లో..

## కమ్యూనిస్టుల పురోగమనమే
# సమాజానికి రక్ష



### -అవకాశవాదులకు తెలంగాణలో స్థానం లేదు
### -సిపిఐ జనరల్ బాడీ సమావేశంలో కూనంనేని

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మారుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సమాజానికి కమ్యూనిస్టులే రక్ష అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. భారత దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని కార్పొరేట్ల వద్ద సంపద పోగుపడుతుందని హక్కులు హరించబడుతున్నాయని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ బోనకల్ మండల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం బ్రాహ్మణపల్లి గ్రామంలో జరిగింది. గ్రామ ఉప సర్పంచ్ ఏలూరి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశంలో కమ్యూనిస్టుల పురోగమనం తథ్యమన్నారు. మోడీ అవకాశవాద కార్పొరేట్ అనుకూల పాలన సాగిస్తున్నారని కూనంనేని తెలిపారు. మోడీ, అమిత్ షా లేదా ఇతర బిజెపి నాయకులు

మిగతా 2లో..

# ఖరీఫ్ సాగుకు సన్నద్ధం..!



(మొదటిపేజీ తరువాయి) వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్నలు, ధాన్యాన్ని కాంటాలు వేసి తరలించాలని రైతులు కోరుతున్నారు.

**కల్తీని అరికట్టేదెలా....?**

గడిచిన మూడేళ్లగా కల్తీ విత్తనాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. కల్తీ విత్తనదారులపై కఠినంగానే వ్యవహరిస్తున్నప్పటికీ కల్తీ విత్తనాల విక్రయం మాత్రం ఆగడం లేదు. ప్రతి ఏడాది ఎక్కడో ఒక చోట కల్తీ విత్తనాల భారీన పడి రైతాంగం నష్టపోతూనే ఉంది. గతేడాది మిర్చి, ధాన్యం రైతులతో పాటు కొన్ని ప్రాంతాల్లో పత్తి రైతులు కూడా నష్టపోయారు. గ్రామాల్లో పత్తి విత్తనాల బుకింగ్ జరుగుతుంది. రైతాంగం ఈ విత్తన బుకింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. బిల్లులు లేకుండా ఏ రైతు కూడా విత్తనాలను కొనుగోలు చేయరాదని బిల్లు లేకుంటే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ధర తక్కువగా ఉందని ఆశపడితే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. కల్తీ విత్తనాల పట్ల రైతులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

**బీమా కోసం డిమాండ్ :**

పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. వరుస విపత్తులతో రైతులు నష్టపోతున్నారు. పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే నష్టపోయిన రైతుకు పరిహారం దక్కుతుంది. గ్రామం యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అతివృష్టి అనావృష్టి ఇతరత్రా కారణాలతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి పలుమార్లు నెలకొంది. ఈఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతన్నలు కోరుతున్నారు. దీనితో పాటు యాసంగికి సంబంధించి రైతు భరోసాను పూర్తి స్థాయిలో జమ చేయలేదు. వానాకాలానికి పెట్టుబడి అందించే విధంగా జూన్ మాసంలోనే రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

# కమ్యూనిస్టుల పురోగమనమే సమాజానికి రక్ష

(మొదటిపేజీ తరువాయి) కాంగ్రెస్ కంటే కమ్యూనిస్టుల పైనే ఎక్కువగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా బిజెపి రాజకీయ లబ్ధి పొందుతుంది తప్ప బిజెపి పాలన పట్ల ప్రజల్లో సానుకూలత లేదన్నారు. ఏ ఒక్క హామీని మోడీ ప్రభుత్వం 12 ఏళ్ల కాలంలో నిలబెట్టుకోలేదన్నారు. నల్ల ధనం రప్పించడం, రెండు కోట్ల ఉద్యోగాలు, పేదల ఖాతాల్లో నగదు జమ ఇలా ఏ వాగ్దానాన్ని నిలబెట్టుకోక పోగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పట్ల వివక్షాపూరిత ధోరణి అవలంభిస్తుందని కూనంనేని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం సిపిఐ పోరాడుతుందన్నారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అవకాశవాద రాజకీయాలకు తావులేదని ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారికి సిపిఐ తగు రీతిలో సమాధానం చెబుతుందని కూనంనేని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ కాదు కదా వాని జేజమ్మ సైతం కమ్యూనిస్టులను అంతం చేయలేరని కూనంనేని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బలానికి అనుగుణంగా పోటీ చేయాలని ఆయన సూచించారు. చారిత్రిక నేపథ్యం కలిగిన



గ్రామాలైన బ్రాహ్మణపల్లి, కలకోట, రాపల్లి, రాయన్నపేట, మోటమర్రి తదితర గ్రామాల్లో సిపిఐకి ప్రాతినిథ్యం ఉండేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశానికి ముందు సిపిఐ పతాకాన్ని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పారుపల్లి రాఘవయ్య ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు అధ్యక్షురాలు బత్తినేని నీరజ, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తుము రోషన్‌కుమార్, జక్కుల రామారావు, మండల నాయకులు పారుపల్లి నర్సింహారావు, నాగేశ్వరరావు, వంగల నర్సింహ, కొంగర కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఉలిక్కిపడ్డ మూడో వార్డు షాడో..!

(మొదటిపేజీ తరువాయి) చేసుకుంటున్నాడు.

**వెల్లువెత్తుతున్న ఆరోపణల పర్వం...**

మూడోవార్డుకు చెందిన సదరు షాడోపై తాజాగా పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పలు వివాదాల్లో పేరు వినిపించిన ఆయన వ్యవహారశైలిపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో బైపాస్‌రోడ్డుకు సంబంధించిన భూ వ్యవహారంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అనంతరం ఇందిరమ్మ కాలనీలోని స్థలాల విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. వీడియోలో కనిపిస్తున్న వివరాల ప్రకారం..ఓ వ్యక్తి ఓ స్థలానికి సంబంధించి డబ్బులు చెల్లించినట్లు చెబుతున్నాడు. ఆ స్థలంపై వివాదం తలెత్తడంతో తనకిచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చినట్లు పేర్కొంటున్నాడు. ఈ సందర్భంగా భార్య, పిల్లల పేరుతో డబ్బులు తిరిగి చెల్లించానని ఓ ఆలయంలో ప్రమాణం చేస్తున్న దృశ్యాలు సదరు వీడియోలో కనిపిస్తున్నాయి. అయితే




బాధితుడిగా చెప్పుకుంటున్న వ్యక్తి వాదన ప్రకారం డబ్బులు తీసుకున్నప్పటికీ సంబంధించిన పత్రాలు వెనక్కి ఇవ్వడం లేదని వాపోతున్నాడు. ఈ అంశం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి ఘటనలు ఒక్కటేకాక మరిన్ని ఉన్నాయంటూ స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో సంబంధిత ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**తీవ్ర చర్చనీయాంశంగా ప్రజాపక్షం కథనం...**

షాడో నాయకుడి వ్యవహారాలపై ప్రజాపక్షం ప్రచురిస్తున్న వరుస కథనాలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కథనాలు వెలువడిన అనంతరం సోషల్ మీడియా వేదికలు, వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత స్థాయిలో చర్చ కొనసాగుతోంది. కథనం ప్రస్తావించిన భూ వివాదాలు, ప్రభుత్వ స్థలాల వ్యవహారాలు, షాడో లీలలకు సంబంధించిన ఆరోపణలు ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వీడియో నేపథ్యంలో కథనంలో వెల్లడైన అంశాలపై మరింత చర్చ జరుగుతోంది. అటు ప్రజాపక్షం కథనం వెలువడిన తర్వాత దానిపై కొందరు అనుకూలంగా, షాడో అనుయాయులు ప్రతికూలంగా స్పందిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారు. దీంతో అసలు విషయాలపై ప్రజల్లో ఆసక్తి మరింత పెరిగింది. అంతేకాకుండా సదరు షాడో వాట్సాప్ గ్రూపుల్లో వార్తలను సర్కిలేట్ చేస్తున్న తీరు గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్న చందంగా కనిపిస్తుంది. ప్రజాపక్షం దినపత్రిక ప్రచురిస్తున్న కథనం ప్రకారం ఏ పేరు లేకపోయినప్పటికీ ఎందుకు సదరు షాడో ఉలిక్కి పడతున్నాడంటూ సాక్షాత్తు అధికారులు, ప్రజలే చర్చిస్తుండటం విశేషం.

## మహిళ సంఘాల భవనాలు శరవేగంగా పూర్తి చేయాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మహిళ సంఘాల భవనాలు శర వేగంగా పూర్తి చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం లో శుక్రవారం మహిళ సంఘం భవనం ను శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల ను ఆర్థికంగా నిలిపేందుకు ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా నిర్మించనున్న భవనాలు సమస్యల పరిష్కార వేదికలుగా నిలవాలని సూచించారు. మండలంలోని భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో బడి బాట ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ దివ్యాంగ విద్యార్థి, భవిత కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, సర్పంచ్ దండా రంగయ్య, ఉప సర్పంచ్ రాసాల నవీన్, పీఆర్.ఏఈ ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ల జారీలో పారదర్శకతకు పెద్దపీట

**-ప్రజలకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ సేవలు : తహసీల్దార్**



ప్రజాపక్షం/అశ్వాపురం: ప్రజలకు రెవెన్యూ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించడమే తన ప్రధాన లక్ష్యమని అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాశ్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. సర్టిఫికెట్ల జారీ పూర్తిగా నిబంధనల మేరకు జరుగుతుందని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి సకాలంలో సర్టిఫికెట్లు అందజేస్తున్నామని చెప్పారు. దరఖాస్తుదారులు ఎలాంటి సమస్యలు ఎదురైనా మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు అవగాహన పెంచుకుని అధికారులతో సమన్వయం చేసుకుంటే పనులు త్వరగా పూర్తవుతాయని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈసమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లీలావతి, యూడీసీలు, జీపీఓలు, సిబ్బంది, పాల్గొన్నారు.

## తిరుపతి తెలంగాణ భవన్ నిర్మాణ కమిటీ చైర్మన్‌గా దోసపాటి



ప్రజాపక్షం/అశ్వాపురం: తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రంలో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక తెలంగాణ భవన్ నిర్మాణ కమిటీ చైర్మన్‌గా దోసపాటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. గురువారం ఆర్యవైశ్య సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీ నారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు వెంకటేశ్వరరావుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలంగాణ భక్తులకు మెరుగైన వసతి, ఇతర సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ భవన్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ తిరుపతిలో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. వెంకటేశ్వరరావు అనుభవం, నాయకత్వంతో నిర్మాణ పనులు వేగంగా పూర్తవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ భక్తుల అవసరాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలతో రూపుదిద్దుకోనుంది. ఈ నియామకం పట్ల ఆర్యవైశ్య సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నోటిఫికేషన్ ఎందుకు?

## పాత వారినే ప్రకటించుకోవచ్చు కదా?

**సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు సింగరేణి స్కూల్లో ప్రతి సంవత్సరం కొత్త వారిని నియమించాలని దృక్పథంతో సింగరేణి యాజమాన్యం కొత్త నోటిఫికేషన్ స్కూలుకు సంబంధించిన టీచర్లు, పిఈటి, అటెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈ నోటిఫికేషన్ మార్కులు ఆధారంగా, కొంత ఎక్స్పీరియన్స్ కొంత మార్కుల ద్వారా ఎంపిక జరుగుతుందని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. సింగరేణి అధికారులు నోటీసు బోర్డు ద్వారా ఇంటర్వ్యూలు చేపట్టారు అన్నారు. ఈ ఇంటర్వ్యూలో ప్రతి సంవత్సరం స్కూల్లో చెప్పే టీచర్లు కూడా ఇంటర్వ్యూ హాజరవుతారు అన్నారు. ఆ యొక్క సర్టిఫికెట్లు మరియు ఎక్స్పీరియన్స్ ఆధారంగా డెమో ద్వారా కొత్తవారిని అపాయింట్ చేస్తారు అన్నారు. కానీ ఎవరైతే గతంలో పనిచేశారు వారికి కొంత ఎక్స్పీరియన్స్ ఆధారంగా పర్సంటేజ్ చూపిస్తూ పాత వారినే కొనసాగిస్తూ, వారికి అనుకూలంగా ఉన్నటువంటి వారిని రిక్రూట్మెంట్ కొనసాగిస్తున్నారు అన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి అటెండర్లను వారిని కొనసాగిస్తూ పనిచేస్తున్న వారికి ఎక్స్పీరియన్స్ ఎక్కువ చూపించి మరియు వారినే పదేపదే కొనసాగిస్తుండడం జరుగుతుంది అన్నారు. పాతవారినే కొనసాగించుకున్నప్పుడు కొత్తవారికి నోటిఫికేషన్ ఎందుకు పెట్టినట్టు సుదర ప్రాంతాల నుండి అనేకమంది జిరాక్స్ ల ద్వారా తమ టైం వేస్ట్ చేసుకుని పోస్టుల కోసం ఎదురుచూస్తూ ఉదయం నుండి సాయంత్రం 8 వరకు గంటల వరకు ఈ పోస్టుల కోసం అనేకమంది వేచి ఉన్నారని, ఎంతమంది ఉన్నా లాస్ట్ కు వారు అనుకున్న వారికి, వారి దగ్గర పని చేస్తున్న వారికే అధిక మార్కులు వేసి వారికే అవకాశం కల్పించారని వారు ఆరోపించారు అన్నారు. ఇది పారదర్శకంగా నిజాయితీగా జరిగినది కాదని, ఇలాగైతే వచ్చే సంవత్సరం కూడా ఈ ఎక్స్పీరియన్స్ కలిపి మరల వారికే అవకాశం ఇస్తారు కదా అని వారు ప్రశ్నించారు. బయట పనిచేసిన ఎక్స్పీరియన్స్ ఉన్న వారిని గమనంలోనికి తీసుకోకుండా ఇంటర్వ్యూ నిర్వహించారు తప్ప అసలైన వారికి న్యాయం జరగలేదని వారన్నారు. పదేపదే గతంలో పనిచేసిన వారిని మరే కొనసాగించడం పట్ల పలువురు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.. దీనిపై విచారణ చేపట్టాలనీ వారు డిమాండ్ చేశారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

## -కెఎంసి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ, మొక్కల ప్రాముఖ్యత, పచ్చదనం పెంపుదల, పరిశుభ్రత, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడుదాం భవిష్యత్తును రక్షిద్దాం, ప్లాస్టిక్‌కు నో చెప్పండి ప్రకృతికి చేయూతనివ్వండి, ఒక మొక్క నాటండి జీవనాన్ని కాపాడండి అంటూ నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారి రాధిక, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ లు మాట్లాడుతూ ప్రకృతి మన జీవనాధారమని మనం పీల్చే గాలి, తాగే నీరు, సాగు చేసే భూమి జీవ వైవిధ్యం అన్ని పర్యావరణంలో భాగమన్నారు. ఆరోగ్యకమైన పర్యావరణం లేకుండా మానవ జీవనం అసాధ్యమన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, ప్లాస్టిక్ కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పుల కారణంగా ప్రకృతి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటుందని ఈ పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఒక మొక్క నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని ఆదా చేయడం, చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి చర్యలు సమాజంపై గొప్ప ప్రభావం చూపుతాయన్నారు. నగరాలు, గ్రామాలు పరిశుభ్రంగా పచ్చదనంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, అధికారులు, సిబ్బంది, గార్డెన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిటిడికి స్థలం అప్పగింత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని అల్లిపురం సమీపంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించిన భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం టిటిడి అధికారులకు అప్పగించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం కృషి చేశారు. అల్లిపురం ప్రాంతంలో స్థలాన్ని గుర్తించి క్యాబినెట్ సమావేశంలో టిటిడికి స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానం చేశారు. దానికి అనుగుణంగా ఖమ్మం కార్పోరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆలయ నిర్మాణానికి సంబంధించి స్థల కేటాయింపుకు సంబంధించి తీర్మానం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్బన్ తహసీల్దార్ డి. జయచందర్ ఆధ్వర్యంలో టిటిడికి కేటాయించిన ధంసలాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 408లో 20.04 ఎకరాల భూమికి ఖమ్మం అర్బన్ సర్వేయర్, టిటిడి సర్వేయర్ ఆధ్వర్యంలో హద్దులు నిర్వహించి భూమిని అప్పగించారు. ధంసలాపురం సర్వే నెం.408లో 20.04 ఎకరాల భూమిని టిటిడి సర్వేయర్ హరినాథ్ టి, అసిస్టెంట్ ఇంజనీర్ చెలికాని జగన్‌మోహన్‌రావు, సహాయకులు బాలాజీకి భూమిని అప్పగించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా టిటిడి ఆలయ నిర్మాణానికి కృషి చేశారన్నారు. భూమి కేటాయింపుతో పాటు ఆలయ నిర్మాణానికి సంబంధించిన నిధులను కూడా టిటిడి మంజూరు చేసిందన్నారు. భూ కేటాయింపుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ సర్వేయర్ నాగేశ్వరరావు, గిర్దావర్ సత్యనారాయణ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి మోహన్ రుద్రాక్షకు అండగా ఉంటాం

## -వైద్యులపై చర్యలు తీసుకోవాలి -చిన్నారి తల్లికి ఇందిరమ్మ ఇళ్లు అవుట్ సోర్సింగ్ ఉద్యోగానికి సిఫార్స్ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన రేణుకకు ఇద్దరు కవల పిల్లలు. అందులో ఒకరు మోహన్ రుద్రాక్ష అనే చిన్నారి ఖమ్మంలోని ప్రభుత్వ వైద్యులు నిర్లక్ష్యానికి గురై చెయ్యి తీసివేయడం జరిగిన విషయాన్ని తెలుసుకున్న వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ కొత్తగూడెంలో రైటర్ బస్తీ గొల్లగూడెంలో ఉంటున్న రేణుక కుమారుడు రుద్రాక్ష మోహన్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో ఫోన్ చేసి మోహన్ రుద్రాక్ష పట్ల వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన వైద్యులపై కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా చిన్నారి మోహన్ రుద్రాక్షకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా చిన్నారి వైద్య ఖర్చుల కోసం అయ్యే మొత్తం ఖర్చులను తాను భరిస్తానని, పుణ్యపురంలో రేణుకకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంతో పాటు ఔట్‌సోర్సింగ్ విభాగంలో ఆమెకు ఉద్యోగం ఇచ్చే విధంగా చూడాలని కలెక్టర్ కోరారు. చిన్నారికి ఆర్టిఫిసియల్ చెయ్యి అమర్చేందుకు కృషి ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, పుణ్యపురం కాంగ్రేస్ పార్టీ నాయకులు వెంగళ కృష్ణయ్య, టిడిపి నాయకులు గద్దె శ్రీనివాసరావు, కాంగ్రేస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు నాగరబోయిన కృష్ణయ్య, గ్రామ ఉప సర్పంచ్ బట్టు రాఘవయ్య, వాకదాని నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు తడకలతో భూ ధరలు..!

## సవరించాలని ప్రజలు వేడుకోలు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు రెవెన్యూ గ్రామాలలో నూతనముగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రకటించిన భూ ధరలలో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. మండల పరిధిలోని లక్ష్మీ పురంలో భూ ధర అదనంగా ఉండగా కల్లూరు లో తక్కువగా ఉండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో తక్కువ ధర పల్లె ప్రాంతంలో ఎక్కువ ధర ఉండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గ్రీన్ ఫీల్డ్ హైవే వెంట ధర అదనంగా ఉండాల్సింది పోయి తగ్గించి ఉండటం ఇదేమని ప్రశ్నిస్తున్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ ధరలు తగ్గించాల్సిన చోట పెంచారని పెంచాల్సిన చోట తగ్గించారని ప్రజల్లో చర్చలు మొదలైనవి మండల పరిధిలోని వెన్నవల్లి, పెద్ద కోరుకొండి, లక్ష్మీ పురం లలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు తగ్గించాల్సిన ప్రాంతాలలో పెంచారని అదే విధంగా కల్లూరు మున్సిపాలిటీలో, గ్రీన్ ఫీల్డ్ హైవే వెంట పెంచాల్సిన భూ ధరలు తగ్గించారని ఇదేమి వ్యత్యాసం అని ఒకరునొకరు రైతులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో రెవెన్యూ శాఖకు తప్పుడు తడకలతో సలహాలు సూచనలు ఇచ్చి తప్పు చేశారని రైతుల్లో నొకరు ఒకరు చర్చలు కొనసాగుతున్నవి. ప్రభుత్వం చర్చించి సవరణలు చేయాలని మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, ప్రభుత్వ అధికారులను ప్రభుత్వాన్ని కోరుతున్నారు, లేనిచో ఆందోళన వ్యక్తం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# కల్లూరు కమీషనర్‌గా రామచంద్రరావు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు ఇన్చార్జి కమిషనర్ గా రామచంద్రరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం ఒకే సంవత్సరంలో ఏడవ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ చైర్మన్ పాలకవర్గం ప్రజల సహకారంతో సమన్వయంగా అభివృద్ధికి సహకరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ నాగేశ్వరరావు, వార్డు అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, ఆయనకు పుష్పగుచ్చం శాలువాలతో సత్కరించి సన్మానం చేశారు.

# స్లాట్ బుక్ చేశారు.. రిజిస్ట్రేషన్ మరిచారు...

## రైతుల్లో ఆందోళన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు మే నెల 25వ తేదీ నుండి రైతులు భూ రిజిస్ట్రేషన్ కొరకు ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకున్నారు. ప్రతులను తహాశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కొరకు అందించగా వాటిని భూమి ధరలు పెరిగే వరకు కూడా ఆన్లైన్ చేయకుండా బుట్ట దాఖలు చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నూతన భూ ధరలు ప్రకారం ధరలు పెరగడంతో పెరిగిన ధరల ప్రకారం ప్రస్తుతం ఆన్లైన్ అవుతుందని చేసేదేమీ లేదని తహాశీల్దార్ లబ్ధిదారులకు తెలియపరచడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు ను ఈ విధంగా ఇబ్బంది పెట్టడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కల్లూరు లోని తహాశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం తహాశీల్దారును రైతులు నిలదీశారు. స్లాట్ బుకింగ్ సమయంలో మే నెల 25వ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు ధర తక్కువ ఉన్నదని ఐదో తేదీ నుంచి ధరలు పెరిగాయని అప్పుడు ధరకు ఇప్పుడు ధరకు రెక్కలు వచ్చాయని పెరిగిన ధరను ఎవరు బరిస్తారని తహసిల్దార్ ను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని రైతులు పేర్కొంటున్నారు.

# వనమా విశ్వేశ్వరరావుకు సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన వనమా విశ్వేశ్వరరావును, వైరాలో బిఆర్ఎస్ నాయకురాలు బానోతు మనీషా లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ కృష్ణమూర్తి, నూకల వాసు, వనమా చిన్ని, అప్పం సురేష్, కామినేని శ్రీనివాసరావు, ముదిగొండ పుల్లయ్య, బోస్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో వృద్ధురాలి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 27వ వార్డుకు చెందిన బానోత్ సువాలి(90) శుక్రవారం వడదెబ్బకు గురై మృతి చెందారు. ఇటీవల మండుతున్న ఎండల తీవ్రత కారణంగా ఆమె అస్వస్థకు గురై ఇంటి వద్దనే కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి భర్త గతంలోనే మరణించగా, ఆమెకు ఉన్న ముగ్గురు కుమారులు కూడా కాలం చేశారు. ప్రస్తుతం మనవళ్లు, మనవరాల్లు ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు.

# 30వ వార్డు సమస్యలపై కమీషనర్‌కు కౌన్సిలర్ వినతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులోని సాయి బృందావన్‌నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికై సిపిఐ కౌన్సిలర్ దండి శ్రీజలోకేష్, కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కాలనీలో రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కమీషనర్ సమస్యలను పరిశీలించి, అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఒక వారం రోజుల్లో అవసరమైన పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గుణగంటి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి సురభి సాయికృష్ణ, రామ్‌జీబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సమ్మర్‌క్రీడా శిక్షణ శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని పెద్ద వెంకటగిరలోని జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో 45రోజులు నిర్వహించిన సమ్మర్‌క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారంతో విజయవతంగా ముగిసింది. ఈ సందర్భంగా 60మంది విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ యువజనం సంఘం నాయకుడు కందుకూరి వెంకటనారాయణ హాజరయ్యి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శిబిరం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ వికేసిఎం ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్యాతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలం పెంపకం అత్యంత అవసరమన్నారు. ప్రతీ ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజ్, జిల్లా అటవీ అధికారి కృష్ణగౌడ్ తదితరులు కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలు కాల్చొద్దు



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని కూసుమంచి గ్రామంలో పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలపై కళాజాత బృందాల ద్వా రా రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్ మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, వాటిని భూమిలో కలియదున్ని సేంద్రియ ఎరువులుగా వినియోగించాలని సూచించారు. నిషేధిత హెచ్‌టీపీ పత్తి సాగు, నకిలీ విత్తనాలు, నానో ఎరువుల వినియోగం, ఎరువుల సమతుల్య వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మాట్లాడుతూ అనుమతి లేకుండా విత్తనాలు విక్రయించే వారిపై వెంటనే వ్యవసాయ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా అపరాలు, పప్పు ధాన్యాల సాగు చేపట్టాలని సూచించారు. జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువులు కూసుమంచి, జకేపల్లి, చేగొమ్మ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవ కేంద్రాల్లో 50శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం తురకగూడెం గ్రామంలో కూడా రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జానీతో పాటు రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం




ప్రజాపక్షం/ములకలపల్లి: ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం మూకమామిడి గ్రామ పంచాయితీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు మానవ మనుగడకు అత్యవసరమని తెలిపారు. అనంతరం పంచాయితీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి, ఇన్‌చార్జ్ పంచాయితీ కార్యదర్శి ఇస్లావత్ సునేష్, వార్డు సభ్యు లు సున్నం భద్రమ్మ, బచ్చల చైతన్యకుమారి, కీసరి రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు వేప విజయ, మడకం రాధ, రమాదేవి, వట్టం జయ, రవ్వ వసంత, మహాలక్ష్మీ, ఆశా వర్కర్లు గుగుల్ జ్యోతి, కణితి జయ, సున్నం లక్ష్మీ, వరలక్ష్మీ, వీవోఏల స్వయం లలిత తదితరులు మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ముత్యం బిక్షం, కొమరం కృష్ణ, గడ్డం వెంకటేష్, సిగ శంకర్, సాంబ, శ్రీను, వెంకటేష్, తిరుపతిరావు, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణే రాబోయే తరాలకు గొప్ప కానుక అని పలువురు అభిప్రాయపడ్డారు.

## సీపీఐ(ఎం)సీనియర్ నాయకుడు కొడెం లక్ష్మీనర్సు మృతి



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం)సీనియర్ నాయకుడు కొడెం లక్ష్మీ నర్సు(60)శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. అమరజీవి ఏలూరు లక్ష్మీ నారాయణ నాయకత్వంలో, తన సోదరుడు కొడెం అనంతరాములుతో కలిసి పూర్వ ఇల్లందు డివిజన్‌లో పార్టీ ప్రజా పోరాటాల్లో చురుకుగా పని చేశారు. అలాగే మధిర మాజీ ఎంఎల్‌ఏ అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు వద్ద సుదీర్ఘకాలం డ్రైవర్‌గా సేవలందించారు. గాంధీనగర్‌లో జరిగిన అంతిమయాత్ర సందర్భంగా మృతదేహంపై సీపీఐ(ఎం)పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు స్వాతి, రాణిలకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం)మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్, సీనియర్ నాయకులు కరపాటి వీరస్వామి, కేసగాని రామ్మూర్తి, ఈసం వెంకటేశ్వర్లు, కరపాటి లక్ష్మయ్య, గోవర్ధనగిరి దశరథ్, జాగటి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కొడెం బోస్, బాయమ్మ, నీలిమ, గోపి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అందరి కృషితోనే జాతీయస్థాయిలో మనకు గుర్తింపు

**- ఐటిడిఏ పిఓ రాహుల్**






ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ యూనిట్ అధికారులు, ఇబ్బంది కృషితో ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాదం వల్లే జాతీయస్థాయిలో భద్రాచలం ఐటిడిఏకు చక్కటి గుర్తింపు వచ్చిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సక్సెస్ మీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 20242026 వరకు చేపట్టిన అనేక కార్యక్రమాల ద్వారా జాతీయ స్థాయిలో ఐటిడిఏకు మంచి గుర్తింపు లభించిందని, ఇందు కోసం గురువారం న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.5 లక్షల రివార్డు అందుకున్నామని తెలిపారు. భారతదేశంలో మొత్తం 214 ఐటిడిఏలు గిరిజన సంక్షేమానికి పాటుపడుతున్నాయని, ఈనెల 3న క్షేత్రస్థాయి అధికారుల సమావేశం న్యూ ఢిల్లీలో జరిగిందన్నారు. వివిధ రాష్ట్రాలు జిల్లాలకు కలిపి 9 వార్డులు ప్రకటించగా, గిరిజన సంక్షేమానికి పెద్దఎత్తున పాటుపడుతున్న భద్రాచలం ఐటిడిఏకు జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు దక్కిందన్నారు. దీనికి అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది కృషి ఉందని, అందరూ సమిష్టిగా కష్టపడి పనిచేయడం వల్లే చక్కటి ఫలితాలు రాబట్టగలిగామని చెప్పారు. అన్ని విభాగాల్లో భద్రాచలం ఐటిడిఏ ముందుందని, విద్యా,వైద్య, ఉద్యోగ ఉపాధి కల్పనతో పాటు సంక్షేమం, టూరిజం, మౌళిక సదుపాయాల వంటి అంశాల్లో ప్రగతి సాధించామని, ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు సాగుదామన్నారు. అనంతరం యూనిట్ ధికారులు, సిబ్బంది అందరి సమక్షంలో కేక్ కట్ చేసి శుభా కాంక్షలు తెలిపిన అనంతరం యూనియ్ అధికారులు, సిబ్బంది పిఓను ఘనంగా సన్మానించి వికాస రథసారధి అనే బిరుదును అంకితం చేస్తూ జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, డిడి చందన, ఆర్‌సిఓ అరుణకుమారి తో పాటు మధుకర్, ఉదయ్, చంగల్ రావు, మణిధర్, సున్నం రాంబాబు, వేణు, అశోక్ రమేష్, సైదులు, హరికృష్ణ, ఆదినారాయణ, ఐటిడిఏ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సారపాక మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెట్ల పెంపకం జరగకపోతే మానవాళి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వృక్షో రక్షతి రక్షితః అనే సందేశాన్ని గుర్తు చేస్తూ, చెట్లను కాపాడితే అవే మన జీవితాలను కాపాడతాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వాలతో పాటు ప్రతి పౌరుడూ భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యనిర్వాహణాధికారి, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, గ్రామ పంచాయితీ కార్యనిర్వాహణాధికారి జి రవికుమార్, వార్డు సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డ), పాటి అశోక్, కాంగ్రెస్ నాయకులు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, ఇల్లంగి లాలయ్య, గుంటక శేషిరెడ్డి, మల్లి కృష్ణ, బర్మావత్ రాంబాబు, గ్రామ పంచాయితీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమలదే కీలక పాత్ర

**-ఐటీసీ పీఎస్‌పీడీలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు**






ప్రజాపక్షం/బూర్గంపాడు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అభివృద్ధి, పర్యావరణ సమతుల్యతే సుస్థిర భవిష్యత్తుకు పునాది అని ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యం పేర్కొంది. 54వ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సారపాకలోని పీఎస్‌పీడీ(పేపర్ బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ డివిజన్)కర్మాగారంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో జరిగిన కార్యక్రమంలో యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్, హెడ్ మ్యాన్యుఫ్యాక్టరింగ్ కె రాంబాబు, హెడ్ టెక్నికల్ జయంత్ కుమార్ దాస్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రఫుల్ల కుమార్ సమంత్ సింగ్, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ముందుగా ఐటీసీ ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధితో పాటు ప్రకృతి పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య నియంత్రణ, నీటి సంరక్షణ, హరిత వాతావరణ పరిరక్షణలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. హెడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ కె రాంబాబు, ఎస్‌బీయూ 1 హెడ్ టి ఎస్ భాస్కర్, ఇతర అధికారులు మాట్లాడుతూ పర్యావరణ హిత విధానాల అమలులో ఐటీసీ ఎప్పటికప్పుడు ముందంజలో ఉంటోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే చెట్ల పెంపకం, వ్యర్థాల నియంత్రణ, సహజ వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, నినాదాలు, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, గృహిణులు, పిల్లలకు బహుమతులు అందజేశారు. అనంతరం కర్మాగార ప్రాంగణంలో విస్తృతంగా మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో కె రాంబాబు, ప్రఫుల్లకుమార్ సమంత్ సింగ్, టిఎస్ భాస్కర్, ఆర్‌పి సింగ్, మనీష్ శర్మ, శివరామకృష్ణ, సౌరవ్ ముఖర్జీ, తదితర అధికారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటారు.

## రక్తదానం.. ప్రాణదానంతో సమానం

**- ఘనంగా సిపిఐ కార్పోరేటర్ జివిఆర్ జన్మదిన వేడుకలు**
**- మానవత్వాన్ని చాటే ప్రతీ కార్యక్రమానికి అండగా ఉంటాం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా**



ప్రజాపక్షం/పాల్వంచ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ ఒక్కరు దీనిని ఒక సామాజిక బాధ్యతగా తీసుకొని ముందుకు రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. కొత్తగూడెం మునిసపల్ కార్పోరేషన్ పరిధి పాత పాల్వంచ 47వ, డివిజన్ సిపిఐ కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు ( జివిఆర్ ) జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరాన్ని మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. మొక్కలు నాటారు. జివిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ... ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదాతలు ఆశా దీపాలన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకొని ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలని కోరారు. యువత రక్తదానం వైపు అడుగులు వేయటం అభినందనీయమని కొనియాడారు. పుట్టిన రోజు ఇలాంటి ఉన్నతమైన శిభిరం ఏర్పాటు చేయటం, సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో నిలిచేలా గుర్రం వెంకటేశ్వర్లు కృషి ప్రశంసనీయమన్నారు. సమాజంలో మానవత్వాన్ని చాటే ప్రతీ కార్యక్రమానికి సిపిఐ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బర్ల వెంకటరత్నం, ఎస్‌ఏ. రహమాన్, గౌస్‌పాషా, అహ్మద్ జానీ, మస్తాన్, ఆలపాటి ప్రసాద్, కరీం, నాగేశ్వరరావు, క్రిష్ణ, వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

### మట్టి తవ్వకాలకు అనుమతులు సరే..!

## ఫిట్‌నెస్ లేని వాహనాల సంగతేంటి..?



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులతో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అయితే తవ్వకాల కంటే వాటి రవాణలో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనలే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. మట్టి తవ్వకాల అనుమతులు ఉన్నాయనే పేరుతో రోడ్లపై ఫిట్‌నెస్ లేని ట్రాక్టర్లు, ఇన్సూరెన్స్ గడువు ముగిసిన వాహనాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని బండ్లు, కాలుష్య ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు నిర్భయంగా సంచరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, ట్రక్కులు రాత్రింబవళ్లు తిరుగుతున్నప్పటికీ సంబంధిత రవాణా శాఖ అధికారులకు అవి కనిపించక పోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సాధారణ ప్రజల వాహనాలను తనిఖీ చేసే అధికారులు, భారీ స్థాయిలో మట్టి రవాణా చేస్తున్న వాహనాల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నల ఉత్పన్నమవుతున్నాయి. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే కొన్ని ప్రాంతాల్లో మైనర్లు ట్రాక్టర్లు నడుపుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేని వ్యక్తులు భారీ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ఎప్పుడైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు? అనే ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. మట్టి తవ్వకాలలో వినియోగిస్తున్న కొన్ని జేసీబీలకు సైతం సరైన పత్రాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ వంటి ప్రాథమిక నిబంధనలు లేకుండానే యంత్రాలు పని చేస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చట్టాలు సామాన్యులకేనా లేక భారీ వ్యాపార కర్యకలాపాలు నిర్వహించే వారిపై వర్తించవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ, కూసుమంచి మండలంలో జరుగుతున్న ఈ పరిస్థితులు ఆ తనిఖీల ప్రభావంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే విధంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని వాహనాలను సీజ్ చేశారు? అనే వివరాలు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లపై నిర్లక్ష్యంగా తిరుగుతున్న ఫిట్‌నెస్ లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్, ఇన్సూరెన్స్ లేని యంత్రాలు, సరైన పత్రాలు లేని రవాణా వ్యవస్థపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలను ముందుగానే నివారించే చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని గుర్తు చేస్తున్నారు. మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, ఆ మట్టిని తరలిస్తున్న వాహనాలు చట్టబద్ధంగా ఉన్నాయా లేదా అన్నది చూసే బాధ్యత రవాణా శాఖదే..అధికారులు స్పందించకపోతే ప్రమాదాలకు బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న ప్రస్తుతం కూసుమంచి మడలంలో వినిపిస్తోంది.

## ప్రకృతిని కాపాడితేనే సుస్థిర భవిష్యత్తు

**ఏరియా జీఎం దుర్గం రామచందర్**



ప్రజాపక్షం/మణుగూరు: ప్రకృతిని కాపాడితేనే వాతావరణాన్ని రక్షించగలం, వాతావరణాన్ని రక్షిస్తేనే మన భవిష్యత్తును భద్రపరచగలం అనే ఉన్నత ఆశయంతో సింగరేణి సంస్థ ముందుకు సాగుతోందని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026ను పురస్కరించుకొని శుక్రవారం నాడు జీఎం కార్యాలయ ప్రాంగణంలో మరియు ఎంఎన్‌జీఓస్ ప్రాంగణంలో పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పర్యావరణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతీ సంవత్సరం జూన్ 5వ తేదీని ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఈ ఏడాది అంతర్జాతీయ పర్యావరణ అధికారిక వేడుకలు అజర్బైజన్ దేశంలో నిర్వహించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరపు అధికారిక అంతర్జాతీయ సందేశాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం డి. వెంకటరామరావు, పిఓ ఎంఎన్‌జి సు శ్రీనివాస్, ఏజీఎం(ఐఈడీ) సిహెచ్. రాంబాబు , డిజీఎం (సివిల్) జి. శివప్రసాద్, డిజీఎం(సర్వే)ఎల్. దయాకర్, డిజీఎం(క్వాలిటీ) గ రమేష్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్, ఏరియా పర్యావరణ అధికారిజే. శ్రీనివాస రావు, ఎస్ఈ(పర్చేస్) సుదర్శన్ రెడ్డి, మణుగూరు ఓసీ జర్ పి. శ్రీరంగ రెడ్డి, సీనియర్ ఎస్టేట్స్ అధికారినికే. స్వప్న, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సింగు శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉపేందర్ , ఇతర అధికారులు, జిఎం ఆఫీస్ ఏఐటియూసి పిట్ సెక్రటరీ ఏ. రాజశేఖర్, ఐఎన్‌టియూసి పిట్ సెక్రటరీ రవి వర్మ, ఎంఎన్‌జిఓసి గని పిట్ సెక్రటరీలు జిఎం ఆఫీస్ సిబ్బంది, మణుగూరు ఓసీ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల ఉక్కుపాదం

**-బూర్గంపాడులో 11 మంది పట్టివేత, ఇద్దరికి జైలు శిక్ష**



ప్రజాపక్షం/బూర్గంపాడు: మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై బూర్గంపాడు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో 11 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని శుక్రవారం భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి శివ నాయక్ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి 9 మందికి జరిమానా విధించగా, ఇద్దరికి ఒక రోజు జైలు శిక్షతో పాటు 100 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈసందర్భంగా బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ప్రాణభద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ద్విచక్ర వాహనాదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. "మద్యం సేవించి వాహనాలు నడపవద్దు, మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడండి" అని ఎస్ఐ మేడా ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వికలాంగ సోదరుడి ఆవేదనకు చలించిన ఎంఎల్‌ఏ

**-ఉపాధి కల్పించేందుకు అధికారులకు ఆదేశాలు**



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలో అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం పర్యటించిన వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ మానవీయతను చాటుకున్నారు. మండల సీనియర్ నాయకుడు దారావత్ భద్రు నివాసంలో జరిగిన తేనేటి విందుకు హాజరైన ఎంఎల్‌ఏను కలిసేందుకు పొలంపల్లికి చెందిన ఓ వికలాంగ యువకుడు వచ్చాడు. జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఏదైనా ఉపాధి అవకాశాన్ని కల్పించాలని కోరుతూ అతను వినతి పత్రం అందజేశారు. ఆ యువకుడి బాధలను ఓపికగా విన్న ఎంఎల్‌ఏ, అతని దరఖాస్తును స్వయం గా పరిశీలించారు. వికలాంగుడి పరిస్థితిని అర్థం చేసుకున్న ఆయన వెంటనే స్పందించి, బ్యాంకు ద్వారా స్వయం ఉపాధి యూనిట్ మంజూరు చేసే అవకాశాలను పరిశీలించాలని మండల అధికారులకు సిఫారసు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్యను శ్రద్ధగా విని, పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఎంఎల్‌ఏకు వికలాంగ యువకుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశాడు. చిన్న వినతినైనా నిర్లక్ష్యం చేయకుండా స్పందించిన ఎంఎల్‌ఏ వైఖరి అక్కడున్న వారిని ఆకట్టుకుంది. దీంతో ప్రజాప్రతినిధి అంటే ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవాలని మరోసారి నిరూపితమైంది.

## రోడ్డు పనుల్లో నాణ్యతపై రాజీ లేదు

**-నాసిరకం పనులు చేస్తే బిల్లులు నిలిపివేస్తాం:ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్**



ప్రజాపక్షం/కారేపల్లి: పొలంపల్లి, కోటిలింగాల బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం ఆయన కాలినడకన దాదాపు మొత్తం రహదారి మార్గాన్ని పరిశీలించి, జరుగుతున్న పనుల తీరును నిశితంగా గమనించారు. ఈసందర్భంగా కల్వర్టుల నిర్మాణ పనులను కూడా పరిశీలించిన ఎంఎల్‌ఏ, నాసిరకం పనులు చేస్తే సహించేది లేదని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ప్రజల డబ్బుతో చేపడుతున్న అభివృద్ధి పనులు అత్యున్నత ప్రమాణాలతో పూర్తి కావాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత పర్యవేక్షణ అధికారులపై ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకునేలా చూస్తామని, అవసరమైతే కాంట్రాక్టర్ల బిల్లులను కూడా నిలుపుదల చేయిస్తామని ఎంఎల్‌ఏ హెచ్చరించారు. ప్రజా ప్రయోజనాలే తనకు ముఖ్యమని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఎంఎల్‌ఏ స్వయంగా పనుల వద్దకు వెళ్లి పరిశీలించడం, నాణ్యతపై కఠిన వైఖరి అవలంభించడం స్థానిక ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది.

## ములకలపల్లి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి ప్రెస్ క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముదిగొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా గడ్డం ఉదయ్ ఎన్నికయ్యారు. అదే విధంగా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా అయిత శేషగిరిరావు, కోశాధికారిగా బషీర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు స్థానిక పాత్రికేయులు శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

# నాడు రూ.2 లక్షలకు.. నేడు రూ.20 లక్షలకు విక్రయం..?

-మెగా ఫుడ్ పార్క్ రైతులకు వరమా... లేక నష్టమా?
-భారీగా చెట్ల నరికివేతతో పర్యావరణ వేత్తల ఆందోళన
-ఉపాధి కోల్పోతున్న తాటి, గౌడ కార్మికులు
-ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సమంజసమేనా అని రైతు సంఘాల ప్రశ్న








**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బుగ్గపాడులో 2005లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా ఫుడ్ పార్క్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు కోసం రైతుల వద్ద నుంచి ఎకరాకు సుమారు రూ.2 లక్షల చొప్పున 200 నుంచి 250 ఎకరాల భూమిని సేకరించింది. అనంతరం రోడ్లు, డ్రైనేజీలు, ప్రహరీ గోడలు, కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వంటి మౌలిక వసతుల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించింది. అయితే ఫుడ్ పార్క్‌లో కార్యకలాపాలు నిర్వహించిన ఒక మామిడి ప్రాసెసింగ్ కంపెనీ తగిన సౌకర్యాలు లేక పోవడం, కోల్డ్ స్టోరేజీ సరిగా పనిచేయకపోవడం, నీటి సమస్యలు, నాణ్యతలేని నిర్మాణాల కారణంగా కార్యకలాపాలను నిలిపివేసినట్లు సమాచారం. అదనంగా సదరు సంస్థ విద్యుత్ శాఖకు సుమారు కోటి రూపాయల మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఫుడ్ పార్క్‌లోని సుమారు 84 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీకి ఎకరాకు రూ.20 లక్షల చొప్పున విక్రయించినట్లు వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. రైతుల నుంచి తక్కువ ధరకు సేకరించిన భూమిని పదింతల ధరకు విక్రయించడం వెనుక ఉన్న కారణాలపై రైతు సంఘాలు వివరణ కోరుతున్నాయి. పచ్చని చెట్లకు గొడ్డలి వేటభూమిని కొనుగోలు చేసిన సంస్థ అక్కడ ఉన్న మామిడి, చింత, వేప, రావి, తాటి తదితర భారీ వృక్షాలను తొలగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున చెట్లను నరికి టింబర్, ఫైర్‌వుడ్‌ను లారీల ద్వారా హనుమాన్ జంక్షన్ ప్రాంతానికి తరలిస్తున్నట్లు సమాచారం. అటవీ శాఖ అనుమతులు తీసుకున్నారా లేదా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. చెట్ల తొలగింపుకు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. రైతు సంఘాల డిమాండ్‌ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన భూమిని ప్రైవేట్ సంస్థలకు విక్రయించడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. భూముల విక్రయ ప్రక్రియ, ధరల నిర్ణయం, చెట్ల నరికివేతకు సంబంధించిన అనుమతులపై పారదర్శకత పాటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన భూమిని ప్రైవేట్ సంస్థలకు విక్రయించడం న్యాయమేనా అని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఫుడ్ పార్క్ పేరుతో రైతుల నుండి నామమాత్రపు ధరకు భూమి సేకరణ జరిపి, నేడు అదే భూమిని భారీ ధరకు అమ్ముకోవటం ఏమిటని సమీప గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాడు ఫుడ్ పార్క్ ఊసే లేకుంటే మా భూములు ఇచ్చే వారం కాదని నేడు అవే భూములను మేము ఇదే రేటుకు అమ్ముకోలేమా అంటూ వాపోతున్నారు. ఫుడ్ పార్క్ చుట్టూ జరుగుతున్న వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీసి తక్షణమే ప్రజలు, ప్రజా సంఘాలు, రైతులు, రైతు సంఘాల నాయకులకు సరైన సమాచారం అందించాలని కోరుతున్నారు. చెట్ల నరికివేతకు సంబంధించి అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా అనుమతులు ఉన్నాయని, తామే అనుమతులు తీపించామని తెలిపారు. ఫుడ్ పార్క్ జేఈ ని వివరణ కోరగా 84 ఎకరాలను తమ్మిన మాట వాస్తవమేనని, వాళ్ళ భూములలో వాళ్ళు ఏమైనా చేసుకుంటారని ఎటకారపు సమాదానం చెప్పటం కొసమెరుపు.

# రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వం ఉచితంగా అందించాలని, కల్తీ విత్తనాలు, నకిలీ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారులను అరికట్టాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) సత్తుపల్లి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి మండల తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బిరెల్లి లాజర్, సహాయ కార్యదర్శి పాశం అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందని చెప్పుకుంటూనే ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు రోజు,రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు తగిన మద్దతు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదలకు భూములు, ఇళ్లులేని వారికి గృహాలు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు చిన్న, సన్న కారు, మధ్య తరగతి రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు పాత రుణాలను రద్దు చేసి, వడ్డీ లేని కొత్త రుణాలు అందించాలని, వ్యవసాయ పరికరాలను 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. కనీస మద్దతు ధరలు ప్రకటించి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కల్తీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ డివిజన్ అధ్యక్షుడు ఒగ్గు నాగిరెడ్డి, ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, టీయూసీఐ జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్, ఏఐయుకేఎస్ మండల కార్యదర్శి కోర్స వెంకటేష్, నాయకులు నాగప్రసాద్, రాజు, సున్నం కృష్ణ, నేకొండ అలివేలు, హనుమంత్, శ్రీనివాస్, దుర్గ, చెల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడు మృతి



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలం పందిళ్ళపల్లి గ్రామం వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతకాని గ్రామపంచాయతీ పదో వార్డు సభ్యుడు మాతంగి నాగరాజు(32) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తన స్నేహితుడు లింగాల మహేందర్‌తో కలిసి అర్ధరాత్రి 12.15 సమయంలో ఖమ్మం లో చికిత్స పొందుతున్న స్నేహితుడ్ని చూసేందుకు ద్విచక్రవాహనం పై వెళ్లారు. ఆసుపత్రిలో స్నేహితుడిని పరామర్శించి తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామం బయలుదేరారు. వారి వాహనాన్ని పందిళ్ళపల్లి సమీపంలో బోనకల్ వైపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న భారీ ట్రిప్పర్ వేగంగా ఢీకొట్టింది. టిప్పర్ టైర్లు నాగరాజు కాళ్లపై నుంచి వెళ్లడంతో రెండు కాళ్ళు ఛిద్రమయ్యాయి. తలకు సైతం తీవ్ర గాయాలవడంతో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మహేందర్ సైతం తీవ్రంగా గాయపడటంతో ఖమ్మం లోని ఆసుపత్రిలో చేర్పించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం అనంతరం చింతకాని తీసువచ్చారు. నాగరాజుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగరాజు మృతదేహాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మత్కేపల్లి మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్, గ్రామ శాఖ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, పలువురు తహసీల్దార్‌లు, పలు గ్రామ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

# పోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్లు జైలు శిక్ష

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఫోక్సో కేసులో నిందితునికి ఖమ్మం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు శుక్రవారం 20 ఏళ్లు జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే.. గణేశ్వరం గ్రామానికి చెందిన 27 సంవత్సరాల మాలోత్ హుస్సేన్‌పై 2024లో రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం ఖమ్మంలోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 1 అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు నిందితునికి 20 ఏళ్లు జైలుశిక్షతో పాటు రూ. 30వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును అప్పట్లో రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి దర్యాప్తు చేయగా, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ ఎండి ఉస్మాన్ షరీఫ్ దర్యాప్తు నిర్వహించారు. ప్రభుత్వం తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. శరత్ కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. భరోసా లీగల్ ఆఫీసర్ ఎం. ఉమారాణి, కోర్టు లైజన్ అధికారులు, ఎస్ఐ కె. శ్రీకాంత్, సిడివో యు. సాంబశివరావు ,హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాసరావు, హోంగార్డ్ యు. చిట్టిబాబు తదితరులు కేసు విచారణలో సహకరించారు.

# కోర్టు ప్రాంగణంలో హరితోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో హరితోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన హరితోత్సవ కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తులు పాల్గొని జామ, మామిడి, ఉసిరి, మర్రి, రావి, కానుగ, ఇతర మొక్కలను నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ కాలుష్యం కొరలు చాస్తున్న నేటి తరుణంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరమన్నారు. మొక్కలు నాటుదాం భవిష్యత్తును కాపాడుదాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. మొక్కలు నాటడమేకాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకోవాలని తెలిపారు. న్యాయస్థానాలు న్యాయంతో పాటు పచ్చదనానికి కూడా నెలవు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గం, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు, అటవీ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీలుగు, జనుములను సద్వినియోగించుకోవాలి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నేల సారాన్ని పెంపొందించి, పంటల దిగుబడులను మెరుగుపరిచే జీలుగు, జనుములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని చిన్నతండలో గల ఏదులాపురంసొసైటీ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడటంలో ఈ పంటలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఓ ఉమానగేష్, ఏఈఓ కావ్య, సంఘం డైరెక్టర్లు మద్ది కళింగరెడ్డి, మట్టా శ్రీకాంత్, సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/చింతకాని :** మొక్కజొన్న పండించిన రైతుల నుంచి చివరి గింజవ రకూ కొనుగోలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మొక్కజొన్నను పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి రైతు పక్షపాతిగా నిలిచినందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి చింతకాని రైతు వేదికలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ రైతు మద్దతు ధర అడిగితే బేడిలు వేసినడిపించిన నాయకులు నేడు రైతులపై మొసలికన్నీరు కారుస్తున్నారని బారాస నేతల కల్లబొల్లి మాటలు రైతులు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, ఆత్మ కమిటి డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, చింతకాని సహకార సంఘం అధ్యక్షులు కొండపల్లి శేఖర్ రెడ్డి, నాయకులు అబ్దుల్ నబీ, బందెల నాగార్జున, కూరపాటి కిషోర్, కొల్లి గోవిందరావు, మండల మహిళా అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

# పిడియాల భద్రమ్మకి నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో పిడియాల భద్రమ్మ అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు దంపతులు అక్కడికి వెళ్లి భద్రమ్మ భౌతికఖాయం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భద్రమ్మ కొడుకు వినోద్‌ను వారు పరామర్శించి ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో పాపగంటి వెంకటేశ్వర్లు, జవ్వాజి వెంకటేశ్వరరావు, జవ్వాజి ఆంజనేయులు, పిడియాల లక్ష్మయ్య, కాంపెల్లి రుక్మిణమ్మ, కాంపల్లి వెంకటి తదితరులు ఉన్నారు.

# నామమాత్రంగా ఎక్సైజ్ దాడులు..!



**-ప్రభుత్వ నిషేధిత గుడుంబా స్థావరాలపై అబ్కారీ శాఖ దాడులేవి.?**

**-పత్రికల్లో ప్రచురితమైతేనే కదులుతున్న ఎక్సైజ్ శాఖ!**

**ప్రజాపక్షం/కారేపల్లి:** అప్పుడప్పుడు ఏదో..అలా..అలా అనే విధంగా సింగరేణి సర్కిల్ పరిధిలో నామమాత్రపు దాడులు చేస్తూ ఎక్సైజ్ శాఖ చేతులు దులుపుకుంటున్న తీరు పట్ల మండల వ్యాప్తంగా సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం వార్తా పత్రికల్లో ప్రచురితమైతేనే తప్పితే..అబ్కారీ శాఖ వాహనం కార్యాలయం గేటు కూడా దాటకపోవడంతో పాటు, దాదాపు మూడు నెలలు కావోస్తున్న ఇంత వరకు కార్యాలయానికి బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా మారింది. ఇదొక్క ఉదాహరణ చాలు ఎక్సైజ్ శాఖ పనితీరు ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం అవుతుంది. సింగరేణి మండల పరిధిలోని గుంపెళ్ళగూడెం గ్రామంలో జూన్ 3వ తేదీన బుధవారం కేవలం ఒక్క బెల్ట్ షాపు పైన మాత్రమే నామమాత్రపు దాడి చేసి ఎక్సైజ్ శాఖ చేతులు దులుపుకున్నారు. సింగరేణి మండల పరిధిలోని 41 గ్రామ పంచాయితీల పరిధిలో సుమారు 100 గ్రామాలు ఉండగా మిగతా బెల్టు షాపులవైపు కన్నెత్తి కూడా చూడటం లేదని, వివిధ గ్రామాల్లో ఆయా గ్రామస్తులే మద్యం తరలిస్తున్న ఆటోలను అడ్డుకుని ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నా, ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ఆశించిన స్థాయిలో చలనం రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వెలువడితేనే తప్పితే ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధించిన మహమ్మారి నాటుసారా ఘట్టెక్కిపోతున్నా, మరో వైపు గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల రూపంలో మద్యం విజృంభిస్తున్న తరుణంలో ఎక్సైజ్ శాఖ నామమాత్రపు దాడులకే పరిమితమవ్వడం సరైన విధానం కాదని, పచ్చని ఏజెన్సీ గ్రామాలలో నివసిస్తున్న గిరిజనుల జీవితాలపై ప్రభావం చూపిస్తున్న నాటుసారా స్థావరాలపై కూడా దాడులు నిర్వహించి ఎక్సైజ్ శాఖ పట్ల ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించాలని పలువురు సామాజిక కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క దుకాణంపైనే ఎక్సైజ్ సీఐ ఫోకస్....

కారేపల్లిలో నాలుగు వైన్స్ దుకాణాలు ఉండగా ఎక్సైజ్ సీఐ ప్రశాంతి నేతృత్వంలో కేవలం ఒక్క దుకాణం పైనే స్పెషల్ ఫోకస్ పెట్టి కేసులు నమోదు చేయడం, విరివిగా దాడులు చేయడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మిగతా షాపులపై మమకారం చూపిస్తూ, కేవలం గిరిజన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి యొక్క ఒక్క దుకాణం పైనే తరచుగా దాడులు చేయడం వెనుక మతలబు ఏమిటి ?అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనలు ఒక్కో దుకాణానికి ఒక్కోరకంగా ఉండవని, రూల్ సేమ్ ఫర్ ఆల్ షాప్స్ అనే విషయాన్ని మరిచిపోయి, ఒక్కో దుకాణం పట్ల ఒక్కో రూల్ అనే విధంగా ఎక్సైజ్ శాఖ సీఐ ప్రశాంతి నేతృత్వంలో దాడులు జరగడం సరైన విధానం కాదని గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి.

**వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్ ఫైర్....**

ఎక్సైజ్ శాఖ సీఐ ప్రశాంతి తీరు పట్ల గురువారం వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ సైతం ఘాటుగా స్పందించారు. ఎక్సైజ్ సీఐ ప్రశాంతి పనితీరు పట్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. వైన్స్ షాపు నిర్వాహకులకు కులం పేరుతో దూషించడం, గిరిజనులకు సంబంధించిన దుకాణం పైనే కన్నెర్ర చేయడం ఎంత వరకు సమంజసమని? బహిరంగంగానే కార్యకర్తల ముందే ఉన్నతాధికారులను సైతం ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎక్సైజ్ సీఐ ప్రశాంతి పనితీరు పట్ల సొంత శాఖ ఉన్నతాధికారులే ఎంఎల్ఏ ఎదుట తలొగ్గి ఈ రకమైన పొరపాట్లు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, ఎక్సైజ్ శాఖ సీఐ ప్రశాంతి పనితీరు పట్ల ప్రత్యేకమైన, అంతర్గత శాఖపరమైన ఎంక్వయిరీ చేస్తామని తెలిపినట్లు పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కాగా ఈ ఎక్సైజ్ శాఖ వ్యవహారం పట్ల శాఖ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

## దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండలంలో ఇటీవల రాత్రి వేళల్లో ఇంటి దొంగతనాలు (హౌస్ బర్గరీ బై నైట్) జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎండల కారణంగా గ్రామాల్లో చాలా మంది రాత్రివేళ ఇళ్ల బయట వరండాల్లో నిద్రిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూడా ఇంటి ప్రధాన ద్వారాలకు తప్పనిసరిగా తాళాలు వేయాలని సూచించారు. పడుకునే ముందు ఇంటి ప్రధాన ద్వారం, వెనుక ద్వారం, అల్మారాలకు సరైన తాళాలు వేసి ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని తెలిపారు. బంగారం, నగదు, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం ఉత్తమమని, ఇంట్లో ఉంచాల్సి వస్తే సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచాలని సూచించారు. అలాగే ఇంటి బయట, మెట్ల వద్ద, పెరట్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలను నిరోధించవచ్చని పేర్కొన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ముందస్తుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా బీట్ కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వాలని, ఇరుగు పొరుగు వారికి కూడా తెలియజేయాలని కోరారు. కాలనీలు, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి యాక్సెస్‌ను పోలీసులకు అందిస్తే నేర నియంత్రణతో పాటు నేరస్థులను గుర్తించడంలో ఉపయోగపడుతుందని తెలిపారు.ఇక పోలీసు శాఖ తరఫున రాత్రి గస్తీని మరింత ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. బీట్ పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ సిబ్బంది ద్వారా గ్రామాలు, కాలనీల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, పాత నేరస్థుల కదలికలపై కూడా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు .ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరమని, పోలీసులు చేపడుతున్న చర్యలతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటే దొంగతనాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని సత్తుపల్లి పోలీసులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్**

**ప్రజాపక్షం/ జూలూరుపాడు:** పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బిజెపి పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ పిలుపునిచ్చారు.శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం,నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా పన్నెండు ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రమేష్ జూలూరుపాడు గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చిలుకూరి రమేష్ మాట్లాడుతూ. ప్రధానమంత్రి పర్యావరణం కాపాడటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని, అమ్మ పేరుతో ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాడం బాధ్యతగా స్వీకరించాలని కోరారు. రోజు రోజుకు అడవులు తరిగి పోవడం వలన పర్యావరణ సమతుల్య దెబ్బతిని సమయానికి వర్షాలు పడటం లేదన్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. పర్యావరణాన్ని రక్షించాలంటే ప్రతి ఒక్క పౌరుడు ఒక మొక్క నాటి మరో ఐదుగురు మొక్కలు నాటే విధంగా ప్రోత్సహించాలని చిలుకూరి రమేష్ అన్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద రోజులు పని కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. జూలై నెల నుంచి ఎన్ఆర్జీఎస్ పథకం పేరు వికాసిత్ భారత్ జీ రామ్ జీ గా మారుతుందన్నారు. కొత్త పథకంలో కూలీలకు 125 రోజులు పని కల్పిస్తారన్నారు. ఉపాధి హామీ పథకం నిధులను నీటి సంరక్షణకు,రోడ్లు, భవనాల నిర్మాణాలకు ఉపయోగించుకోవాలని రమేష్ సూచించారు. ఉపాధి హామీ కూలీలతో కలసి చిలుకూరి రమేష్ తాగునీటి బోర్ వేల్ కు వెళ్ళే రహదారి సమీపంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్,బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి సిరిపురపు పుల్లారావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ షరీఫ్, బుడిపుడి ప్రభాకర్, ఇల్లంగి గోపయ్య, తాళ్లూరు సూర్యం, అనంత రాములు, దొంతుల వీరయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఆధునీకరణ పనుల్లో జాప్యంపై ఎంపి అసంతృప్తి

**-యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశం**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల జాప్యంపై ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రైల్వే స్టేషన్‌ను సందర్శించిన ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎస్కలేటర్‌ను ఆన్ చేయించి రెండో ప్లాట్ ఫామ్‌కు చేరుకుని దాని పనితీరును గమనించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణ పనులకు సంబంధించిన మ్యాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఆధునీకరణ పనులు ఆశించిన మేర జరగడం లేదని పెండింగ్‌లోఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టిపిసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్‌బాయ్, సత్యనారాయణరెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ సేవలు మరింత విస్తృత పర్చాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా విస్తరించాలని బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలో నిర్వహించిన బిఎస్ఎన్ఎల్ నల్లగొండ బిజినెస్ ఏరియా సలహా సంఘం సమావేశానికి ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు పెరుగుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని బిఎస్ఎన్ఎల్ అందిపుచ్చుకోవాలన్నారు. ప్రైవేటు టెలికం కంపెనీల పోటీని తట్టుకుని ప్రభుత్వ రంగానికి చెందిన బిఎస్ఎన్ఎల్ ఎదగాలన్నారు. ముఖ్యంగా నెట్‌వర్క్ సమస్యలు ఎక్కువగా ఉండే ఏజెన్సీ ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు బిఎస్ఎన్ఎల్ సేవలను విస్తరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించడంతో పాటు 5జి సేవలను కూడా అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. పార్లమెంటులో కూడా బిఎస్ఎన్ఎల్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తామన్నారు. అనంతరం ఎంపి వద్దిరాజు రవిచంద్రను శాలువతో సన్మానించి జ్ఞాపికను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ నల్లగొండ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కెవి బంజర, మూలగూడెం, రజబ్అలీ నగర్, దొనబండ, లచ్చిరాం తండా, మంచుకొండ గ్రామాల్లో కళ్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు, నాయకులు మాలోత్ రాము నాయక్, కొంటెముక్కుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు, ఆయాల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలపరిధిలోని వివిధ పాఠశాలలలో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కొరకు ఉపాధ్యాయులు, ఆయాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని మండల విద్యాశాఖ అధికారి జుమ్మిలాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించబడే పాఠశాలలు : ఎంపీపీస్, పాపకొల్లు, ఎంపీపీస్, జూలూరుపాడు (పీ.ఎమ్.బీ) ఎంపీపీస్, గుండెపూడి, ఎంపీ.యు.పీ.ఎస్ కొమ్ముగూడెం, నందు ఖాళీల వివరాలు ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు ఆయాలు. విద్యా అర్హతలు. ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు, ఇంటర్ ఉత్తీర్ణత, ఆయాలు, 7వ తరగతి ఉత్తీర్ణత. దరఖాస్తుల స్వీకరణ, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మండల వనరుల కేంద్రం (ఎం.ఆర్.సీ), జూలూరుపాడు నందు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సమర్పించవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 08.06.2026 సాయంత్రం 5.00 గంటల వరకు. సమర్పించవలసిన విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, కుల ధృవపత్రం (వర్తించినచో) నివాస ధృవపత్రం పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు దరఖాస్తు ఫారములు, అర్హతలు మరియు ఇతర వివరాల కొరకు మండల విద్యాశాఖ కార్యాలయం, జూలూరుపాడు నందు సంప్రదించాలని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరడమైనది.

# పేదల పక్షాన నిలిచే ఏకైక పార్టీ సిపిఐ

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**
**-సిపిఐలో భారీ చేరికలు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ ప్రజాపోరాటాలు, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ప్రగతికి ఆకర్షితులై పేద, బడుగు బలహీన వర్గాలు భారీ సంఖ్యలో సిపిఐ చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలం అంబేద్కర్ గ్రామ పంచాయితీ పరిధిలోని అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు శుక్రవారం కొత్తగూడెం జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎర్రకండువాలను కప్పి పాషా పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం సాబీర్ పాషా మాట్లాడుతూ నియోజవర్గంలోని పేదప్రజల ఆశాజ్యోతిగా సిపిఐ నిలిచిందని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక పార్టీ ఎర్రజెండానే అని స్పష్టం చేశారు. పార్టీలోచేరిన నూతన సభ్యులు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. అంబేద్కర్ నగర్ గ్రామాభివృద్ధికి అక్కడ దశాబ్దాల కాలంగా పేరుకుపోయిన సమస్యల శాశ్వత పరిష్కారానికి తాము కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్ని రంగాల్లో నియోజకర్గాన్ని అగ్రగామిగా నిలుపుతున్నారని, ప్రజలపక్షాన నిలబడి పోరాడే కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వివరించారు. పార్టీలో చేరిన వారిలో పోతురాజు శ్రీను, మధు, ఎం పుల్లయ్య, ఇనుగంటి రాజు, మహేష్, సారయ్య, భాస్కర్, పరిశుద్ధ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, నాయకులు నీడల సుధాకర్, మన్నెం వెంకన్న,వ జగదాంబ, మేఘనాథ్, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

# మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ చేతుల మీదుగా బొగ్గుల శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి నియామక పత్రం శుక్రవారం అందజేశారు. జమలాపురం అఖిల భారతరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి మండల అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లడంలో మండల అధ్యక్షులు పాత్ర ఎంతో కీలకమన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీపై మరింత విశ్వాసం పెంచేలా పని చేయాలని సూచించారు. మండల అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన బొగ్గుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానన్నారు. కార్యకర్తలందరిని కలుపుకుని పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం తాజా, మాజీ మండల అధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఏఎంసి బండారు నర్సింహారావు, డిసిసిబి డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఛైర్మన్ చావా రామకృష్ణ, జిల్లా యూత్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కృష్ణారావు, వెంకట నర్సయ్య, శ్రీనివాసరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలు కావాలి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామసభలు ప్రజా సమస్యల పరిష్కారాల వేదికలు కావాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ అన్నారు. శుక్రవారం పంజాబ్ గడ్డలో జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నూతన పింఛన్లు ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఆ మాటను నిలుపుకోవాలని అన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని వెంటనే వేగవంతం చేసి పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరీ చేయాలని కోరారు. పారిశుధ్యం పట్ల మున్సిపల్ అధికారులు మరిన్ని చర్యలు తీసుకోవాలని, రానున్న వర్షాకాలం పారిశుధ్యం సరిగా లేకునండా అంటు వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని గుర్తు చేశారు. డి విజన్‌లో ఉండే అన్ని కుటుంబాల వారు తడిపొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్యక్రమాల్లో సహకరించాలని కోరారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో భూగర్భజలాలు అందుగంటి పోతున్నాయని, భూ గర్భంలో నీటి నిల్వలు ఉండాలంటే ప్రతీ ఒక్కరూ నీటిని వృధా చేయరాదని, ఇంటి పరిసరాల్లో ఉంకుడు గుంటలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ వార్డు ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ ఏఇ శ్రీకాంత్, విద్యుత్ అధికారులు, డాక్టర్ రాము, శంకరమ్మ, శ్రీనివాస్, గడ్డ వార్డ్ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య, రంగారావు పాటి మోహన్ రావు, హరినాథ్, కోటేశ్వరరావు, అమిట్ కోటి, మండల రాజేశ్వరరావు, నిఖిల్, భూపేష్ పాల్గొన్నారు.

# పచ్చని ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

**- సింగరేణి గుర్తింపు సంఘం**
**కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పచ్చని ప్రకృతి పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి అనుబంధం) కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. నేటి సమాజం ఎదుర్కొంటున్న అత్యంత కీలకమైన సమస్య ఇదని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, నీటి వనరుల క్షీణత వంటి అనేక సమస్యలు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతీ వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, ప్రాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నీటి వనరులను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన సురక్షితమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి సంస్థ చేపడుతున్న హరిత కార్యక్రమాలు, విస్తృస్థాయిలో మొక్కలు పెంచడం, కాలుష్య నియంత్రణ చర్యలు, పర్యావరణ హిత కార్యక్రమాలను వెంకట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గుడిసె రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గుడిసే రహిత గ్రామాలను తయారు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కోన్నారు. మండలం లోని కోనాయిగూడెం లో ఇందిరమ్మ గృహా ప్రవేశం శుక్రవారం కార్యక్రమంను ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేళ్ల పాటు ఏ గ్రామంలో కూడ ఒక్క ఇల్లు ఇవ్వకపోవటంతో ప్రజలు సొంతిళ్లు లేక ఇబ్బందులు పడ్డారని పేర్కోన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇళ్ల ను శర వేగంగా నిర్మిస్తున్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంత్రి శ్రీనివాసరెడ్డి మంజూరు చేయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటి కి వెళ్లి విస్తృతంగా ప్రచారంచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షుడు పాకనాటి కన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి రాజేష్, ఆనం వెంకటరెడ్డి, కొమ్మినేని విజయ్ బాబు, మందడి నాగశ్రీను, తోట చలపతి, సైదులు, చెరుకుపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క ను నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రుద్ర ప్రదీఫ్, జిల్లా ఉపాధ్యాక్షుడు నకిరికంటి వీరభద్రం, మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరపురం మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో మొక్క నాటే కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పర్యావరణం ఇంజనీర్ రవీంద్ర, సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రీన్ వే ఎన్విరాన్మెంట్ సోసైటీ ఆధ్వర్యంలో బౌద్ధక్షేత్రం వద్ద మెక్కలు నాటారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, బుద్ధ విహార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బంతే సద్దారక్కిత, కాసాని నాగేశ్వరరావు, సోసైటీ అధ్యక్షుడు దుడ్డెల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్తకుప్పలో అంబేద్కర్ విగ్రహం

**-11వ రోజుకు చేరిన దళితుల నిరసన**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం తొలగింపు వివాదం రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. 11 రోజుల క్రితం అర్ధరాత్రి వేళ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీతో విగ్రహాన్ని తొలగించి ఆర్అండ్‌బీ కార్యాలయం సమీపంలోని చెత్తకుప్పలో పడవేయడాన్ని నిరసిస్తూ దళిత సంఘాలు వరుసగా 11వ రోజు కూడా ఆందోళన కొనసాగించాయి. చెత్త కుప్పలో పడివున్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసనలో దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని చెత్తకుప్పలో పడేయడం దళిత సమాజ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని తొలగించిన స్థలంలోనే తిరిగి ప్రతిష్టించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని విరమించబోమని, అవసరమైతే మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొండికుంట గ్రామ పంచాయితీలో సర్పంచ్ మర్రి సంధ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ ముత్యాలరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యాలయం, డంపింగ్ షెడ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల్ల శివకుమార్, వార్డు సభ్యుడు గాదె మల్లిఖార్జున్, గ్రామ పంచాయితీ కార్యదర్శి సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వీవోఏలు, రేషన్ డీలర్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో మేక మృతి

**-రెప్పపాటులో తప్పించుకున్న కాపరి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యుత్ షాక్ తో ఓ మేక మృతి చెందగా...కాపరి రెప్పపాటు లో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. బాధితుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని ఆచార్లగూడెం కు చెందిన మార్తి వెంకటనర్సయ్య అనే గొర్రెల కాపరి రోజు మాదిరిగానే గొర్రెల మంద ను శుక్రవారం మేతకు తీసుకెళ్లాడు. గ్రామ శివారు లో పంట పొలంలో విద్యుత్ తీగ పడి ఉంది. అది గమనించని గొర్రెల మంద తో కాపరి వెంకటనర్సయ్య అటు వైపుగా వెళ్లారు. అందులో ఓ మేక కు వైరు తగలటంతో అక్కడిక్కడే మృతి చెందింది. రెప్పపాటులో వెంకటనర్సయ్య తీగ ను తాకకుండా వెనుతిరగటంతో పాటు, మిగతా మంద ను అటు వైపు రాకుండా తరిమేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత రైతు రూ.15 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. విద్యుత్ తీగ తెగి పంట పోలాలలో పడి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. బాధిత రైతుకు విద్యుత్ శాఖ అధికారుల నుంచి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.